# వాత్సల్యం

డి. సరస్వతి

సాయంత్రం నాలుగైంది. ఎండ తీవ్రత మెల్లగా తగ్గిపోతూంది. స్కూళ్ల నుంచీ, కాలేజీల నుంచీ విద్యార్థులూ, విద్యార్థునులూ వడివడిగా ఇళ్లకు వెళ్లిపోతున్నారు. నిరుపమ అప్పుడే గుమ్మంలోకి వచ్చి నించుని గోపీకోసం ఎదురుచూస్తూంది.

ఇంతలో గోపీ స్కూలు బస్‌లోంచి దిగి హడావిడిగా ఇంట్లోకి పరుగెత్తాడు. అలసివున్న గోపీ చిన్నముఖం చూడగానే ఆమెలోని ప్రేమ పెల్లుబికింది. "రా గోపీ!" అంటూ చేతిలోని పుస్తకాలూ, సంచీ తీసుకుని నుదుటిపై జీరాడుతున్న ముంగురులను సవరించింది.

"గోపీ, ఇక్కడికి రా!" అనే మాధవరావు పిలుపు వినబడింది.

"నాన్నగారు పిలుస్తున్నారు" అంటూ నిరుపమ చేతుల్లోంచి తప్పించుకుని పరుగెత్తాడు గోపీ.

నిరుపమ హతాశురాలై కుర్చీలో కూలబడింది. ఆమె కళ్లలో నీళ్లు చెక్కిళ్లపై నుండి జారాయి.

000

మాధవరావు పేరు పొందిన డాక్టర్. శ్రీమంతుల ఇంటి ముద్దుకొడుకు. ఎం.బి.బి.ఎస్. ఆఖరి సంవత్సరం పరీక్షలవగానే వివాహం జరిగింది. అతని భార్య లక్ష్మి ఇంటర్ ప్యాసైంది. కలవారి ఇంటి పిల్ల.

మాధవరావుకి లక్ష్మి అంటే ఎంతో ప్రేమ. ప్రాక్టీసు పెట్టాక వారి సంసారం చాలా హాయిగా గడిచిపోయింది. పెళ్లయిన రెండేళ్లకు గోపీ పుట్టాడు. దంపతులు గోపీని అల్లారుముద్దుగా పెంచుతున్నారు.

గోపీ రెండేళ్లవాడై వున్నప్పుడు లక్ష్మికి జబ్బు చేసింది. వారంలోనే తీవ్రమై మరణించింది. మాధవరావు సంసారంలోని సంతోషం పూర్తిగా నశించిపోయింది.

అతని తల్లికి దిగులు కలిగింది. ఎప్పుడూ గోపీని గుండెకదుముకుని కన్నీళ్లతో కూర్చునే మాధవరావుని చూచి ఆమె భయపడింది. ఎలాగైనా రెండోపెళ్లి చేసి కొడుకుని సుఖపెట్టాలనే కోరిక ఆమెలో జనించింది. ఆ తలంపు రాగానే ఆమె కళ్లముందు నిరుపమ మెరిసింది.

నిరుపమ ఆమెకు దూరపుబంధువులూ, మధ్యతరగతి కుటుంబీకుల పిల్ల. అందమూ, మంచిహృదయమూ కలిగిన నిరుపమ ఆ యేడే బి.ఏ. పూర్తి చేసి ఉద్యోగంలో చేరింది. తమ బాధ్యత నెరవేర్చుకోవాలని తల్లిదండ్రులామెకు పెండ్లి సంబంధాలు చూడసాగారు. అటువంటి నిరుపమ తమ కోడలైతే తిరిగి తన ఇంట్లో ఆనందం మొలకెత్తుతుందని మాధవరావు తల్లి ఆశించింది. ఒకరోజు మాధవరావు తన రూములో కూర్చొని మెడికల్ జర్నల్ చూస్తున్నాడు. తల్లి అక్కడికి వెళ్లింది.

"ఈ విధంగా ఎన్నాళ్లుంటావు మధూ? పెళ్లి చేసుకో" అన్నది వాత్సల్యంతో.

మాధవరావు నిర్ఘాంతపోయాడు. తనకి రెండవపెళ్లా? ఈ ప్రపంచంలో తన లక్ష్మికి సాటిఅయిన వారున్నారా? ఉహు! తనెప్పటికీ మళ్లీ పెళ్లి చేసుకోడు! తన చిన్నారి గోపీని సవతితల్లి క్రూరత్వానికి బలి చేయడు!

"అది అసంభవం అమ్మా!" ఈ సమాధానం ఆమెకు కటువుగా వినబడింది. కాని ఆమె తన ప్రయత్నాన్ని వదలదలచలేదు. "సంతోషంతో కలకలలాడవలసిన ఇల్లు ఈ విధంగా శోభ లేకుండా వుండటం మంచిది కాదు మధూ! ఈ ఇల్లు శోభస్కరంగా వుండాలంటే నీవు మళ్లీ పెళ్లి చేసుకోవాలి. అంతేకాదు, నేనూ పెద్దదాన్ని అయిపోతున్నాను. గోపీని నా తరువాత చూసేవారు కూడా వుండరు. ఎప్పుడూ నీవు ప్రాక్టీసు వదిలి కూర్చోలేవు కదూ! అందుచేత మంచిపిల్లను చూసి పెళ్లి చేసుకో నాయనా!" అన్నది.

"నా గోపీని పరాయివాళ్ల చేతుల్లో పెట్టి వారి నిర్దాక్షిణ్యానికి బలి చేయలేను! నా లక్ష్మి లేకపోయిన తరువాత నాకెవరూ లక్ష్యం లేదు!" మాధవరావు అన్నాడు బాధగా.

"అందరూ నీవనుకున్నంత క్రూరంగా వుండరు మధూ! ఎవరో ఎప్పుడో సవతిపిల్లల్ని బాధించినంతమాత్రాన అందరూ అలాగే ప్రవర్తిస్తారనుకోవడం పొరపాటు. చదువూ, వివేకమూ కలిగిన ఏ యువతీ ఆ విధంగా ప్రవర్తించదు. నిరుపమ అన్నివిధాలా యోగ్యురాలు. ఆ అమ్మాయి మన యింట్లో తిరిగితే లక్ష్మి తిరిగినట్లే వుంటుంది" అన్నది.

మాధవరావు తల్లితో ఏకీభవించలేదు. మధ్యతరగతి కుటుంబీకుల పిల్లలు తన డబ్బూ, హోదా చూసి పెళ్లి చేసుకుని తన గోపీని బాధిస్తారని అతని ఊహ. అందుచేత అతనికి సామాన్యుల పిల్లలంటే ఒక విధమైన ద్వేషం. ఆ మూర్ఖాభిప్రాయమే తల్లిముందు బయటపెట్టాడు. "ఈ రోజున డబ్బూ, హోదా చూసి చేసుకొంటుంది. రేపు గోపీమీద అధికారం చూపిస్తే నేను సహించలేనమ్మా! అటువంటి వారికి డబ్బే ప్రధానం కాని మనస్సు కాదమ్మా!" అన్నాడు.

తల్లి తెల్లబోయింది. "నీది సంకుచితాభిప్రాయం మధూ! నిరుపమ అటువంటి యువతి కాదు. ఆమె అందం, తెలివీ చూచి యెంతోమంది కాలేజీ విద్యార్థులు ఆశించి అడిగినప్పుడే నిరాకరించింది. అటువంటి నిరుపమ

ఈ కథ ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 8.1.1958 సంచికలో ప్రచురితమైంది

మంచితనం, గౌరవమే ప్రదానంగా ఎంచుతుంది కాని, డబ్బు కాదు. నా మాట విను మధూ!" అంటూ దీనంగా అతనివైపు చూచింది.

మాధవరావుకి మొదటినుంచీ తల్లి అంటే భయం, గౌరవం వున్నందువల్ల ఎదురు చెప్పలేకపోయాడు.

రాయబారాలు జరిగాయి. మాధవరావుని ఇదివరకే చూచివుండటం వలన నిరుపమ అభ్యంతరం చెప్పలేదు. శుభముహూర్తంలో నిరుపమ, మాధవరావు గృహిణి అయింది.

000

నిరుపమకి గోపీ అంటే ఎంతో ప్రేమ. తల్లి లేని లోటు కనిపించకుండా గోపీని పెంచి పెద్దవాడిని చేయాలని ఆమె సంకల్పించింది. గోపీని తన చుట్టూ తిప్పుకుందుకు ప్రయత్నించసాగింది.

మాధవరావుకి మొదటినుంచీ నిరుపమ అంటే అర్థం లేని ద్వేషం. ఆమె తన పొజిషన్, డబ్బూ చూచీ, డబ్బువల్ల కొనుక్కోగలిగే సుఖాల్ని ఆశించీ చేసుకొందని అతని మూఢనమ్మకం. తల్లి తృప్తి కోసం చేసుకున్నందువల్ల నిరుపమనెప్పుడూ తిరిగి చూడలేదు, మాట్లాడలేదు. గోపీని కూడా వెళ్లకుండా కట్టడి చేశాడు. ఎప్పుడైనా నిరుపమ గోపీని దగ్గరికి తీసుకున్నట్లు కనబడితే వెంటనే తీసుకురమ్మని నౌకర్ని పంపేవాడు. ఆమె తప్పకుండా తనకూ, గోపీకీ మధ్య అగాధం కల్పించడానికే ప్రయత్నిస్తోందని అతని అపోహ.

ఈ విధమైన నిరాదరణ నిరుపమను క్రుంగదీసింది. తను గోపీని నిష్కల్మషంగా ప్రేమిస్తూందని ఎట్లా తెలియజెప్పడం? ఆదరణ లేని ఈ డబ్బూ, పొజిషనూ, సుఖాలూ తనకెందుకూ? ఒకవేళ భర్త, తను వాటిని చూచి భ్రమించి వివాహం చేసుకున్నట్లు భావించడం లేదు కదా! ఆ తలంపు రాగానే ఆమె వణికిపోయింది. తను నీచురాలు కాదనీ, గోపీ తల్లి అనీ నిరూపించుకోవాలి. అప్పుడు తన గోపీ తనదగ్గరికి "అమ్మా!" అంటూ వస్తాడు.

ఆలోచనల్లో పడిపోయిన నిరుపమ అడుగుల చప్పుడు విని తేరుకుంది. గోపీ మెట్లెక్కుతున్నాడు. ఆమె చటుక్కున గోపీనెత్తుకుని "నేను నీ అమ్మను గోపీ! నన్ను చూస్తే నీకెందుకంత భయం? నా దగ్గరకు రావూ?" అని అడిగింది రుద్ధకంఠంతో.

గోపీ విడిపించుకొందుకు ప్రయత్నిస్తూ, "నువ్వు అమ్మవి కాదుట. నాన్నగారు నీ దగ్గరికి వెళ్లొద్దంటారు" అంటూ పరుగెత్తాడు.

నిరుపమ నిర్ఘాంతపోయింది. తన భర్తకి తనంటే ఇంత నీచాభిప్రాయమా? ఆమెకు దుఃఖం పొంగుకొచ్చింది. వెక్కివెక్కి ఏడుస్తూ వుండిపోయింది.

మాధవరావు తల్లి అతని ప్రవర్తన చూసి చాలా బాధపడింది. అమాయకురాలైన నిరుపమకి కోరి తెచ్చిన కష్టాలకు ఆమె క్రుంగిపోయింది. ఒకసారి ఆ విషయం మాధవరావు దగ్గర అనేసరికి ఉగ్రుడై, "నీవు కోరి చేసుకున్నదే కదూ?" అని విసురుగా వెళ్లిపోయాడు.

కొద్దిరోజులకే మాధవరావు తల్లికి జబ్బు చేసి హఠాత్తుగా తీవ్రమైంది. ఆఖరిక్షణాల్లో నిరుపమను దగ్గరికి తీసుకొని, "మధు ఎప్పటికైనా తన తప్పు గుర్తిస్తాడమ్మా. ఆ నాడు గోపీ నీ వాడే. సహనం కోల్పోకుండా గోపీని పెంచి పెద్దచేసే బాధ్యత నీదే. తప్పకుండా నెరవేర్చి తగిన తల్లివవుతావని నమ్ముతున్నాను. భగవంతుడు నీకు తప్పక మేలు చేస్తాడమ్మా!" అంటూ కన్నీళ్లతో ఆఖరిశ్వాస వదిలింది.

ఆదరించి, ఓదార్చే ఆ ఒక్క వ్యక్తీ కరవైనందుకు నిరుపమ చాలా వ్యథ చెందింది.

000

నిరుపమ జీవితం రానురాను దుర్భరమవసాగింది. గోపీని ఎంత దగ్గరికి తీద్దామని ప్రయత్నిస్తోందో అంత దూరమవసాగాడు.

ఒకనాడు నిరుపమ తన రూములో చదువుకుంటోంది. మాధవరావూ, ఫ్రెండూ పక్కగదిలో మాట్లాడుకుంటున్నారు.

"గోపీనిక్కడ చూసేవాళ్లు లేరోయ్! అందుచేత మంచి హాస్టల్లో పెడదామనుకుంటున్నా" అన్నాడు మాధవరావు మాటల సందర్భంలో.

"అదేమిటి మధూ? నిరుపమ వుండగా హాస్టల్లో పెట్టడమెందుకు?" అన్నాడు తెల్లబోతూ.

జవాబుగా మాధవరావు క్రోధస్వరం వినబడింది. "ఒక్కనాటికీ గోపీ నిరుపమ చేతుల్లో పెరగటం జరగదు! నా గోపీని కఠినుల చేతుల్లో పెట్టి నాశనం చేసుకోను! డబ్బునూ, పొజిషన్నూ ప్రేమించే మూర్ఖులకి నా హృదయంలో స్థానం లేదు!" అని.

"నిరుపమ చాలా ఉత్కృష్టభావాలు కల యువతి అని విన్నాను మధూ! అయినా నీకింత అనిష్టమైనప్పుడు ఆమెనెందుకు పెళ్లి చేసుకున్నావు? అయినా ఆమె హృదయం ఎలాంటిదో తెలుసుకునేందుకెప్పుడైనా ప్రయత్నించావా?" అని అడిగాడు ఆ మిత్రుడు.

ఎదురుచూడని ఈ ప్రశ్న మాధవరావుని చకితుణ్ని చేసింది. నిరుపమని అర్థం చేసుకునేందుకు తనెప్పుడూ ప్రయత్నించలేదు. తనలో మొదటినుండీ వున్న అభిప్రాయమే ఆమెపట్ల తనకు అసహ్యాన్ని రేకెత్తించింది. కానీ వెంటనే క్రోధం తలెత్తింది. "కావలసినంత డబ్బూ, సుఖం వున్నప్పుడు విచారపడవలసిన అవసరం లేదనుకుంటాను" అన్నాడు నిర్లక్ష్యంగా.

"నీలో సుఖాన్ని గురించిన అభిప్రాయం మూర్ఖంగా వుంది మధూ! డబ్బుతో మానసికసౌఖ్యాన్నెప్పుడూ కొనుక్కోలేం. సన్నిహితులిచ్చే నిష్కల్మషమైన ఆదరణ వలననే

## "ఆయన దొరికారు కనుక...



బతికిపోయాను!" అంటూంది పొడుగుకాళ్ల సుందరి శిల్పాశెట్టి. తన ప్రియుడైన ఆక్షన్‌హీరో అక్షయ్‌కుమార్ తనను కూడా గతంలో ఇతరప్రేయసులను వదిలేసినట్లే వదిలేసి, హాయిగా ట్వింకిల్‌ఖన్నాను పెళ్లాడేసి సెటిలైపోయిన తరువాత చాలాకాలం డిప్రెషన్‌లో గడిపింది శిల్ప. అటుపైన మెల్లమెల్లగా తన దృష్టిని కెరీర్‌పైకి మళ్లించింది. అక్షయ్‌ని ప్రేమించి కెరీర్ పాడుచేసుకున్నవారిలో శిల్ప కూడా వుంది. బాలీవుడ్‌లోనే కాక తెలుగులో మోహన్‌బాబు, వెంకటేశ్, బాలకృష్ణ, తదితరులతో నటించింది. ఇటీవల విడుదలై సుమారుగా నడిచిన 'ధడ్‌కన్'తో శిల్పకు మంచి చిత్రాల్లో చేసేందుకు అవకాశాలొస్తాయన్న మాట వినిపించింది. 'బధాయీ హో బధాయీ' చిత్రంలోనూ చాలా బాగా చేసిందంటున్నారు. అందులోని పాత్రను గురించి చెబుతూ, "అందులో తమాషా పాత్ర లభించింది. నిజజీవితంలో నేను దక్షిణాదికి చెందిన వ్యక్తిని. కాని అందులో పంజాబీ అమ్మాయి పాత్ర చేయాల్సివచ్చింది. ఎట్లారా బాబూ, అనుకుంటూ మనసులోనే చాలా ఇదైపోయాను. కానీ అదృష్టవశాత్తూ సతీశ్‌కౌశిక్ వంటి దర్శకుడి చేతిలో పడ్డాను కాబట్టి నా పని సులువైంది. సతీశ్ పంజాబీ. పైగా మంచినటుడూ, హాస్యస్ఫూర్తి గలవారూను. ఎంతో కష్టపడి చేసినా ఫలితం వుంటుందో లేదోనని నేను పడిన భయమంతా క్షణంలో మాయమైంది. నా పాత్రను 'బంతో' అని పిలుస్తారా చిత్రంలో. సతీశ్ దర్శకత్వంలో ఆ పాత్రను చాలా ఆనందంగా సుఖంగా చేయగలిగాను" అంటూంది శిల్ప. దీన్నే బిజినెస్‌ను ప్లెషర్‌తో కలిపి పని చేయడం అంటారు!

ఎస్.



## గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కింది!

మరేదో కాదు, 'కహో నా ప్యార్ హై' చిత్రమే! "ఆ చిత్రం తరువాత హృతిక్‌రోషన్‌కు వచ్చిన అవకాశాల విషయంలో కానీయండి. దానికి 92 అవార్డులు వచ్చిన సంగతే కానీయండి, మా చిత్రం దాదాపుగా గిన్నీస్‌బుక్ దరిదాపుల్లోకి వచ్చేసింది" అనంటున్నారు హృతిక్ తండ్రి రాకేశ్, బాబాయి రాజేశ్‌రోషన్లు పరమానందంతో. 'టైటానిక్' చిత్రానికూడా పదకొండు ఆకాడెమీ అవార్డులే వచ్చాయట. ఇప్పటికీ ఆ చిత్రాన్ని ప్రశంసిస్తూ అనేకసంస్థల నుంచి ఉత్తరాలు వస్తూనేవున్నాయిట. నిర్మాతా, నిన్నటి నటుడూ అయిన రాకేశ్‌ను "మీకు లభించిన అతిగొప్ప అవార్డు ఏది?" అనడిగితే, "నా కొడుకే!" అంటున్నాడు. చిత్రం గొప్పతనంతో చాలా లాభం కలిగింది అతనికే కదా!

ఎన్.

నిజమైన సుఖం చేకూరుతుంది. అందమూ, చదువూ, తెలివీ వుండి హాయిగా స్వేచ్ఛగా ఉద్యోగం చేసుకొనే నిరుపమ, రెండోపెళ్లికి ఒప్పుకొందంటే, కేవలం డబ్బును చూసేనని అనుకోవడం పొరపాటు. ఇకనైనా ఆమెనర్థం చేసుకొనేందుకు ప్రయత్నించి ఫలితం చూసుకో..."

స్నేహితుడు ఇంకా చెప్పబోతూంటే, "గొడవ చాల్లెద్దూ!" అని బయటికి తీసుకెళ్లిపోయాడు.

ప్రశాంతంగా గడిచే తన జీవితం ఇంత దుఃఖపూరితమైనందుకు క్రుంగిపోతూ కూర్చుండిపోయింది నిరుపమ.

స్నేహితుడి మాటలు మాధవరావు చెవుల్లో మారుమ్రోగుతూవుండేవి. ఒక్కొక్కసారి పొరపాటు చేస్తున్నానేమో అనుకునేవాడు. కానీ వెంటనే ఆమె తన చిన్నారి గోపీకి 'సవతితల్లి' అని గుర్తొచ్చేది. క్రోధంతో కంపించేవాడు.

గోపీ స్కూలుకు వెళుతున్నాడు. పలకా, పుస్తకాలూ పట్టుకుని వెళుతూంటే నిరుపమకి ముచ్చట వేసేది. గోపీకి చదువు చెప్పాలనీ, మధురస్వరంతో తనను "అమ్మా!" అని పిలుస్తూంటే వినాలనీ ఉవ్విళ్లూరేది. కాని గోపీ సాధారణంగా ఆమె కంటపడేవాడు కాదు. ఎప్పుడైనా బుద్ధి తిరిగి వచ్చినా, వెంటనే మాధవరావు చూస్తే మండిపడి పిలిచేవాడు.

నిరుపమ పూర్తిగా నిరాశ చెందింది. తన బాధ్యత నెరవేర్చుకోలేకపోతున్నందుకు విచారించింది. ఆ వ్యథతోనే మంచం పట్టింది.

ఆ రోజు ఉదయం మాధవరావు కాఫీ తాగుతుంటే నౌకరు భయపడుతూ, "అమ్మగారికి చాలా జ్వరంగా వుంది బాబూ!" అని చెప్పాడు.

అతను చిరాకు పడుతూ "పొద్దున్నే ముంచుకుపోయిందని శుభవార్త చెప్పావు, హాస్పిటల్‌కి రా!" అని నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు.

000

మాధవరావు గోపీని హాస్టల్‌కి పంపేశాడు. మందులిస్తున్నా నిరుపమ జ్వరతీవ్రత కొన్నిరోజుల వరకూ తగ్గలేదు.

"గోపీ! నీ అమ్మను కదూ? నా దగ్గరకు రావూ?" అని పలవరించసాగింది. ఆ పలవరింతలు విశ్వాసపాత్రుడైన ముసలి నౌకర్ని కదిలించేశాయి. ఆమె మాతృప్రేమకి నివ్వెరపోయాడు.

భోజనం చేసి మాధవరావు హడావిడిగా హాస్పిటల్‌కు బయలుదేరాడు. గుమ్మం దాటుతూంటే గబగబా వెళ్లి, "అమ్మగారు పలవరిస్తున్నారు. గోపీని తీసుకురండి బాబూ!" అన్నాడు ధైర్యంచేసి.

"రోగిష్టి కొంపలో వాడెందుకూ? ఆదరించేవాళ్లు లేక తప్పులు పట్టడానికా? అయినా నీ రాయబారమేమిటి?" అంటూ విచక్షణత లేకుండా చెంప ఛెళ్లుమనిపించాడు.

"మీరింత నిర్దయుగా ప్రవర్తిస్తారనుకోలేదు అయ్యగారూ!" అని వెంటనే వెళ్లిపోయాడు.

000

నెలరోజులు గడిచిపోయాయి. నిరుపమ జ్వరం తగ్గుముఖం పట్టింది. లేచి తిరిగే సత్తువ లేక అలాగే బాధపడుతూ పడుకొనివుండేది.

ఆ రోజు మాధవరావు పుస్తకం కోసం నిరుపమ రూములోకి వెళ్లి బీరువా తీశాడు. నిరుపమకి పెళ్లినాడు పెట్టిన కొత్తచీరెలూ, నగలూ అన్నీ వెక్కిరింతగా నవ్వాయి. వాటిలో ఒక్కటి కూడా వాడినట్లు లేదు. నిరాభరణ అయిన నిరుపమ దీనస్వరూపం అతని కళ్లముందు నిలిచింది. డ్రాయరు తీయగానే తను ఇన్నాళ్లూ ఆమెకు డబ్బే ప్రధానమని ఎంచి, ప్రతినెలా ఖర్చులకి నౌకరుకిచ్చి పంపే డబ్బంతా అలాగే పడివుంది. అతను తెల్లబోయాడు. నిరుపమ ఈ సౌఖ్యాలన్నీ అనుభవించనేలేదా? అతనిలో ఏదో బాధ రేకెత్తింది. తిరిగి చూసేసరికి, తనూ, లక్ష్మి, గోపీ తీయించుకున్న ఫోటో టేబుల్‌పై కనబడింది. మొదటిసారిగా మాధవరావు హృదయంలో నిరుపమపై జాలి రేకెత్తింది.

"మనుష్యులు కోరేవి డబ్బువల్ల కొనుక్కునే సుఖాలు కావు. సన్నిహితులిచ్చే నిష్కల్మషమైన ఆదరణే నిజమైన సుఖాన్నిస్తుందని, అటువంటి ఆదరణే ఆశిస్తారు" స్నేహితుడి మాటలు చెవుల్లో మారుమ్రోగాయి. గోపీని నిరుపమ పిలిచినప్పుడల్లా తను కసురుకునేవాడు. నిరుపమ వివేకమూ, ఉత్కృష్టహృదయమూ గల యువతి అని తెలిసివుండి కూడా కన్నతల్లి తప్ప మరెవ్వరూ ప్రేమతో ఆదరించరనే అభిప్రాయంతో ఆమెను గాయపరిచాడు. నిరుపమ గోపీని దగ్గరికి తీసి మాట్లాడించ ప్రయత్నించిన ప్రతి దృశ్యం అతని కళ్లముందు మెరిసింది. కానీ అప్పుడు తనేమనుకున్నాడు? ఆమె గోపీని తనకు దూరం చేసి నిరాదరిస్తుందని అపోహ పడ్డాడు. నిరుపమ తన గోపీకి తగిన తల్లి! ఇక నిరుపమను బాధపెట్టకూడదు! తన ఇల్లు ఆనందంతో కలకలలాడాలి!

మాధవరావు వడివడిగా నిరుపమ మంచం దగ్గరికి వెళ్లాడు.

ఆమె పడుకొనివున్నది. కళ్లలోంచి నీళ్లు కారుతున్నాయి.

మాధవరావు ఆప్యాయంగా ఆమె తలపై చేయి వేసి నిమిరాడు.

"గోపీ! వచ్చావా బాబూ?" ఆమె తుళ్లిపడి కళ్లు విప్పి చూచింది. ఎదురుగా భర్త! అతని ముఖంలో పశ్చాత్తాపం స్పష్టంగా గోచరిస్తూంది.

"నిన్ను చాలా బాధపెట్టాను. నన్ను క్షమించు నిరుపమా!" అన్నాడు గాద్గదికంగా.

నిరుపమ సంతోషంతో చిన్నగా నవ్వింది.

అన్ని రోజులకు ఆమె ముఖం నవ్వుతో వెలుగులీనినందుకు ఆనందిస్తూ, ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఇంతలో గోపీ "నాన్నా! నాన్నా!" అంటూ వస్తున్నాడు.

"గోపీ! రా బాబూ!" అంటూ నిరుపమ చేతులు చాపింది.

గోపీ తండ్రి వంక చూశాడు.

"అమ్మ రమ్మంటోంది, వెళ్లు గోపీ!" అన్నాడు మాధవరావు.

"అమ్మా!" చిలిపిగా నవ్వుతూ వచ్చిన గోపీని దగ్గరికి తీసుకుని గుండెలకదుముకుంది నిరుపమ వాత్సల్యంతో.

ఆ దృశ్యం చూసిన మాధవరావు కళ్లలోంచి ఆనందబాష్పాలు రాలాయి.

●